


తెలుగు జాతీయ దినపత్రిక
అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :115 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజిలు : 10, వెల. 6రూ/ శుక్రవారం 20 ఫిబ్రవరి 2026

## ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు

# అసహనం..

### ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని మండిపాటు!

- అందరికీ ఉచిత విద్యుత్తును ప్రకటించిన స్టాలిన్ ప్రభుత్వం
- రాష్ట్ర ఆర్థిక స్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్ ఎలా ఇస్తారన్న సుప్రీం
- ఉచితాల వల్ల దేశ అభివృద్ధి దెబ్బతింటుందని వ్యాఖ్య



2

రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న ఉచిత పథకాలు దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకమవుతాయని సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్తు ఇవ్వడం కన్నా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి సారించాలని సూచించింది.

తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వ ఉచిత విద్యుత్తు ప్రకటనపై సర్వోన్నత న్యాయస్థానం సీరియస్‌గా స్పందించింది. వినియోగదారుల ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అందరికీ ఉచిత విద్యుత్ అందించేలా తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిపాదించింది.

## ఇది బాబు భజన..

# అన్నీ తప్పుడు లెక్కలే

### ఏపీ బడ్జెట్‌పై జగన్ విమర్శలు

- ఏపీ బడ్జెట్ అబద్ధాలు, తప్పుడు లెక్కలమయం అని జగన్ విమర్శ
- సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని ప్రభుత్వంపై ఆరోపణ
- రాష్ట్ర ఆదాయం బాబు అండ్ కో జేబుల్లోకి వెళుతోందని ఘాటు వ్యాఖ్యలు
- సొంత ఆదాయాల వృద్ధిలో ఏపీ 22వ స్థానంలో ఉందని వెల్లడి
- నారా లోకేశ్ పైనా తీవ్ర స్థాయిలో జగన్ ధ్వజం

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల బడ్జెట్ కాదని, కేవలం చంద్రబాబు భజన, తప్పుడు లెక్కలతో నిండిన మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

2



## హెరిటేజ్‌పై ఒక్క ఆధారమైనా చూపాలి

మండలిలో హెరిటేజ్‌పై వైసీపీ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంత్రి అచ్చెన్నాయుడుం



2



2

## నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు..

### ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ఒప్పందాలు!

ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన
ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో పాల్గొననున్న ముఖ్యమంత్రి

ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కీలక పర్యటన చేపట్టనున్నారు. రేపు (ఫిబ్రవరి 20) ఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో ఏఐ ఆధారిత అభివృద్ధికి, యువతకు నైపుణ్య శిక్షణకు మార్గం సుగమం చేసేలా పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంఓయూలు) చేసుకోనున్నారు.

## వైవీ సుబ్బారెడ్డి హయాంలోనే

# నెయ్యి కల్తీ జరిగింది

- హెరిటేజ్‌కు, ఇందాపూర్ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టీకరణ
- సాక్షి పేపర్, భారతీ సిమెంట్ ధరలు పెరిగిన విషయాన్ని గుర్తుచేసిన అనిత
- కల్తీని వదిలేసి హెరిటేజ్‌పై బురద జల్లడమేంటని జగన్‌పై ఫైర్



2

తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) నెయ్యి సరఫరా అంశంలో వైసీపీ అధినేత జగన్ ఇవాళ మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు సమస్య అయిన కల్తీని పక్కనపెట్టి, సంబంధం లేని హెరిటేజ్ సంస్థపై జగన్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె, జగన్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.

## ఈ నెల 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

- 23వ తేదీన మంత్రివర్గ సమావేశం
- 10 నుంచి 15 రోజుల పాటు బడ్జెట్ సమావేశాలు
- మొదటి రోజు గవర్నర్ ప్రసంగం



2

## రాబోయే బడ్జెట్‌లో హామీల అమలుకు నిధులు కేటాయించాలి

- ఆరు గ్యారెంటీలు సహా 95 శాతం హామీలు పెండింగ్‌లో ఉన్నాయని విమర్శ
- నిధులు కేటాయించకపోతే ప్రజలతో కలిసి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక
- గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలన్న బీఆర్ఎస్



2

# ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు అసహనం..

ఈ నేపథ్యంలో డీఎంకే ప్రభుత్వంపై దాఖలైన పిటిషన్ ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్తును ఎలా అందిస్తారని ప్రశ్నించింది.తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వ ఉచిత విద్యుత్తు ప్రకటనపై సర్వోన్నత న్యాయస్థానం సీరియస్‌గా స్పందించింది. వినియోగదారుల ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అందరికీ ఉచిత విద్యుత్ అందించేలా తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో డీఎంకే ప్రభుత్వంపై దాఖలైన పిటిషన్ ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్తును ఎలా అందిస్తారని ప్రశ్నించింది. చాలా రాష్ట్రాల్లో రెవెన్యూ లోటు పెరుగుతోందని... అయినప్పటికే ఉచిత పథకాల పంపిణీ జరుగుతోందని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి ఉచిత పథకాల వల్ల దేశ అభివృద్ధికి విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. సంక్షేమ పథకాల్లో భాగంగా కరెంట్ బిల్లులు చెల్లించలేని వారికి ఉచిత విద్యుత్ అందిస్తామంటే ఒక అర్థం ఉంటుందని... కానీ, మీరు ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని చెబుతున్నారని అసహనం వ్యక్తం చేసింది. ఆహారం, విద్యుత్ ఇలా అన్నీ ఫ్రీగా ఇస్తూ... మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని ప్రశ్నించింది. ఎన్నికలకు ముందే రాష్ట్రాలు ఇలాంటి ఉచిత పథకాలను ఎందుకు తీసుకొస్తున్నాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల సమయంలో అన్నీ ఉచితంగా ఇచ్చుకుంటూ పోతే... అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా కూడా మిగలదని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

# నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు..

ఈ సదస్సులో భాగంగా ఏపీ ప్రభుత్వం పలు చరిత్రాత్మక ఒప్పందాలకు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి భవిష్యత్ సాంకేతికతల్లో నైపుణ్యాలు కల్పించేందుకు దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. అలాగే, ఏఐ, క్వాంటం టెక్నాలజీలలో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు యూనిసీసీ సంస్థతో కలిసి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ సంస్థతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ కోసం ఐఐటీ మద్రాస్‌తోనూ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకోనుంది. ప్రముఖ టెక్ సంస్థ ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై కూడా ఈ సదస్సులో కీలక ప్రకటన చేయనున్నారు.

రేపు ఉదయం 9:30 గంటలకు జరిగే ప్లీనరీ సెషన్‌లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో కలిసి చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, డబ్ల్యూఈఎఫ్ సీఈఓ బోర్కే బ్రెండేతో కలిసి కృత్రిమ మేధస్సు అంశంపై చర్చిస్తారు. ఈ పర్యటనలో భాగంగా యునైటెడ్ కింగ్‌డమ్ ప్రతినిధి బృందంతో పాటు అరామ్కో, అడోబ్, ఆటోడెస్క్ వంటి కంపెనీల అధిపతులతోనూ ముఖ్యమంత్రి విడివిడిగా సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంపై చర్చలు జరుపుతారు.

ఈ సాయంత్రం జైపూర్ కు!

కాగా, ఢిల్లీ పర్యటనకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ సాయంత్రం జైపూర్ వెళ్లనున్నారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహ వేడుకకు హాజరై, రాత్రికి అక్కడే బస చేస్తారు. రేపు ఉదయం జైపూర్ నుంచి నేరుగా ఢిల్లీకి చేరుకొని ఏఐ సదస్సులో పాల్గొంటారు.

# హెరిటేజ్‌పై ఒక్క ఆధారమైనా చూపాలి

హెరిటేజ్ సంస్థపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. చీజ్ ప్యాకెట్లు చేతిలో పట్టుకుని, వాటిని నెయ్యి అని చూపిస్తూ ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, వైసీపీ నేతలకు కనీస అవగాహన ఉందా అని శాసనమండలిలో నిలదీశారు. మండలిలో వైసీపీ సభ్యుల తీరు అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉందని ఆయన విమర్శించారు. ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని గత రెండు రోజులుగా తాను స్పష్టంగా సమాధానం ఇస్తున్నప్పటికీ, అదే అంశాన్ని పట్టుకుని సభా సమయాన్ని వృథా చేయడం దుర్మార్గమని అచ్చెన్నాయుడు అన్నారు. ముఖ్యంగా మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణను ఉద్దేశించి, "చీజ్ ప్యాకెట్లను చూపిస్తూ నెయ్యి ప్యాకెట్లు అంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. మీకు చీజ్‌కు, నెయ్యికి మధ్య తేడా కూడా తెలియదా?" అని ఎద్దేవా చేశారు. హెరిటేజ్‌పై అంతగా అనుమానాలు ఉంటే ఒక్కటంటే ఒక్క చిన్న ఆధారాన్నైనా సభ ముందు పెట్టాలని, లేనిపక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ అసత్య ప్రచారాలపై హెరిటేజ్ సంస్థ ఇప్పటికే వైసీపీ నేతలకు లీగల్ నోటీసులు పంపిందని, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉందని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. "గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలతో పచ్చని తోటలు నరికించినట్లు, ఇప్పుడు ప్రతిష్ఠాత్మక సంస్థల ఆర్థిక మూలాలపై దాడి చేయాలని చూడటం మీ ఫ్యాక్షన్ మనస్తత్వానికి నిదర్శనం" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాలను అడ్డం పెట్టుకుని భారతి సిమెంట్ పేరుతో ప్రభుత్వ ధనాన్ని దోచుకున్న చరిత్ర వైసీపీదని, కానీ హెరిటేజ్ సంస్థ ప్రభుత్వాలతో సంబంధం లేకుండా పారదర్శకంగా వ్యాపారం చేయాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సంస్థ అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నిత్యం వాయిదా తీర్మానాలతో సభను పక్కదారి పట్టించడం మానేసి, దమ్ముంటే ఆధారాలతో మాట్లాడాలని, నిర్మాణాత్మక చర్చకు రావాలని వైసీపీకి ఆయన సవాల్ విసిరారు




# వైవీ సుబ్బారెడ్డి హయాంలోనే

# నెయ్యి కల్తీ జరిగింది

హెరిటేజ్‌కు, ఇందాపూర్‌కు సంబంధమే లేదు

జగన్ ఆరోపిస్తున్నట్లుగా హెరిటేజ్‌కు, ఇందాపూర్ కంపెనీకి ఎలాంటి యాజమాన్య సంబంధం లేదని అనిత స్పష్టం చేశారు. ఇందాపూర్ అనేది బల్క్ మార్కెటింగ్ చేసే సంస్థ అని, అది చీజ్, పన్నీర్, టెట్రాప్యాక్ పాలు వంటి ఉత్పత్తులను తయారు చేసి హెరిటేజ్ వంటి కంపెనీలకు విక్రయిస్తుందని వివరించారు. హెరిటేజ్ సంస్థ నేరుగా వినియోగదారులకు మాత్రమే నెయ్యిని విక్రయిస్తుందని, ఎన్నడూ బల్క్‌గా ట్యాంకర్ల ద్వారా ఇతర కంపెనీలకు సరఫరా చేయలేదని తెలిపారు. "హెరిటేజ్ నుంచి ఇందాపూర్‌కు నెయ్యి వెళ్లి, అక్కడి నుంచి టీటీడీకి వస్తుందని చెప్పడానికి కనీసం బుర్ర పనిచేస్తుందా?" అని ఆమె ఎద్దేవా చేశారు. హెరిటేజ్ సంస్థ తన సిద్ధాంతాల ప్రకారం దేవాలయాలకు బల్క్‌గా సరఫరా చేయదని, ఈ విషయం చిన్నపిల్లవాడిని అడిగినా చెబుతాడని అన్నారు.

ధరల పెరుగుదలపై చిన్న లాజిక్ మిస్సయ్యారు

2015లో రూ.280 ఉన్న నెయ్యి ధర, 2026 నాటికి రూ.650కి ఎందుకు పెరిగిందని జగన్ ప్రశ్నించడాన్ని అనిత తప్పుబట్టారు. కాలంతో పాటు ధరలు పెరగడం సహజమని, ఈ చిన్న లాజిక్‌ను జగన్ ఎలా విస్మరించారని ఆమె ప్రశ్నించారు. "మీరు సాక్షి పేపర్ ప్రారంభించినప్పుడు దాని ధర రూ.2, ఇప్పుడు రూ.6.50. భారతీ సిమెంట్ బస్తా ధర రూ.250 నుంచి రూ.450కి పెరిగింది. 2015లో రూ.19 ఉన్న పాల ప్యాకెట్ ఇప్పుడు రూ.40కి చేరింది. పాల ధర పెరిగితే నెయ్యి ధర పెరగదా? బహుశా పాలు లేకుండానే నెయ్యి తయారుచేసే టెక్నాలజీ మీ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో" అని ఆమె వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కర్ణాటకలో పాల ధరలు అధికంగా ఉండటం వల్లే నందిని డైరీ టీటీడీకి రూ.700కు నెయ్యి సరఫరా చేసిందని, ఆ విషయం గురించి జగన్ ఎందుకు మాట్లాడరని నిలదీశారు.

అసలు దొంగ మీ బాబాయే

అసలు సమస్య అయిన నెయ్యి కల్తీ గురించి మాట్లాడకుండా, జగన్ సంబంధం లేని హెరిటేజ్ అంశాన్ని తెరపైకి తెస్తున్నారని అనిత ఆరోపించారు. నెయ్యి కల్తీ జగన్ ప్రభుత్వ హయాంలో, ఆయన బాబాయి వైవీ సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడే జరిగిందని అనిత తీవ్ర ఆరోపణలు చేశారు. "నెయ్యిలో రసాయనాలు కలిశాయని సిట్, ఎన్డీబీ రిపోర్టులు స్పష్టంగా తేల్చాయి. కల్తీ జరిగిందని నిర్ధారణ అయ్యాక కూడా అప్పటి మీ ప్రభుత్వం ఆ కంపెనీ టెండర్‌ను ఎందుకు రద్దు చేయలేదు? ఎందుకు ఆ సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టలేదు?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. కల్తీ జరిగిందని చార్జ్‌షీట్‌లో ఉన్నా, మీ బాబాయి స్వయంగా అంగీకరించినా దాని గురించి మాట్లాడకుండా, ముక్కు ఎక్కడ ఉందంటే చుట్టూ తిప్పి చూపినట్లు హెరిటేజ్ గురించి ఎందుకు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

టెండర్ నిబంధనలు మార్చిందెవరు?

కేవలం తమకు నచ్చిన కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకే జగన్ ప్రభుత్వం టెండర్ నిబంధనలను నీరుగార్చిందని అనిత ఆరోపించారు. "ఒక చుక్క పాలు కూడా సేకరించని కంపెనీలు కూడా నెయ్యి సరఫరా చేసేలా నిబంధనలను మార్చారు. రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తగ్గించారు. ఇవన్నీ ఎవరికోసం చేశారు? కల్తీపై చర్చకు మేము సిద్ధం. ఆధారాలు చూపించమన్నందుకే ప్రజలకు ఈ వాస్తవాలు వివరిస్తున్నాం. దమ్ముంటే కల్తీ గురించి మాట్లాడండి" అని జగన్‌కు ఆమె సవాల్ విసిరారు.

# ఇది బాబు భజన.. అన్నీ తప్పుడు లెక్కలే:

"మోసానికి షర్టు, ప్యాంటు వేస్తే అది చంద్రబాబే. అబద్ధానికి రెక్కలు కడితే అది కూడా చంద్రబాబే" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలతో ప్రసంగాన్ని ప్రారంభించారు. చంద్రబాబు పాలన "పబ్లిసిటీ పీక్.. పర్ఫామెన్స్ వీక్" అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను మూడు బడ్జెట్‌లలోనూ గాలికి వదిలేసి అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు.

ఆర్థిక లెక్కలన్నీ తప్పుల తడకలేనని జగన్ అంకెలతో సహా వివరించారు. 2024-25లో రూ.1.19 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పి, వాస్తవానికి రూ.94,937 కోట్లు మాత్రమే రాబట్టారని తెలిపారు. పది నెలల్లో రాష్ట్ర ఆదాయ వృద్ధి కేవలం 4.25 శాతమేనని పేర్కొన్నారు. కాగ్ రిపోర్ట్ ప్రకారం, దేశంలోని 23 రాష్ట్రాల్లో సొంత ఆదాయాల పురోగతిలో ఏపీ చివరి నుంచి రెండో స్థానంలో (22వ ర్యాంక్) ఉందని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో 2026-27 నాటికి ఆదాయం 45% పెరుగుతుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు.ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్ర ఆదాయం 'బాబు అండ్ కో' జేబుల్లోకి వెళ్తోందని, "దోచుకో.. దాచుకో.. పంచుకో" అనే విధానం అమలవుతోందని జగన్ ఆరోపించారు. అప్పుల వివరాలను బడ్జెట్‌లో చూపించకపోవడం పారదర్శకత లేకపోవడానికి నిదర్శనమన్నారు. మహిళలకు రూ.1,500, నిరుద్యోగ భృతి వంటి హామీలకు నిధుల కేటాయింపు ఏదని ప్రశ్నించారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల డబ్బుతో కొలంబో, ఢిల్లీ అంటూ విమానాల్లో తిరుగుతూ క్రికెట్ మ్యాచ్ లు చూస్తూ, స్టేడియాల్లో జల్సాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. "రాత్రికి కొలంబోలో ఉంటాడు, మరుసటి రోజు ఉదయం విజయవాడలో ఉంటాడు... సాయంత్రానికి ఢిల్లీ వెళతాడు... అంతా ప్రైవేటు విమానాలే. దేశంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇలా జల్సాలు చేయడం ఎక్కడైనా ఉందా? చంద్రబాబుకు ఒక విమానం, లోకేశ్ కు ఒక విమానం, పవన్ కల్యాణ్ కు ఓ విమానం... అందరూ గాల్లోనే ఉంటారు. క్రికెట్ మ్యాచ్ చూడాలంటే కొలంబోనే వెళ్లాలా... టీవీలో చూస్తే కనపడదా... నేను కూడా టీవీలోనే చూశాను" అంటూ జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

# ఈ నెల 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు,

త్వరలో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 28వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 23వ తేదీన మంత్రివర్గ సమావేశం అనంతరం బడ్జెట్ సమావేశాల తేదీని ప్రకటించనున్నారు. పది నుంచి పదిహేను రోజుల పాటు బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా మంత్రులు, అధికారులతో సమావేశమై ప్రతిపాదనలను స్వీకరించారు.

# రాబోయే బడ్జెట్‌లో హామీల అమలుకు నిధులు కేటాయించాలి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం పదవీకాలం పూర్తికావస్తున్న తరుణంలో, ఇచ్చిన హామీల అమలుకు రాబోయే బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీల అమలుకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనైనా చిత్తశుద్ధి చూపాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన హెచ్చరించారు.

ఆరు గ్యారెంటీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, వాటి అమలును పూర్తిగా పక్కన పెట్టిందని కేటీఆర్ తన లేఖలో విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 95 శాతం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని ఆరోపించారు. గత రెండు బడ్జెట్లలోనూ హామీల అమలుకు అవసరమైన కేటాయింపులు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో 2026-27 బడ్జెట్‌లో అయినా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, యువత, రైతుల కోసం ఇచ్చిన హామీల మేరకు భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓపిక నశిస్తోందని, వారిని ఇకపై వేచి చూసేలా చేయవద్దని సూచించారు.

కేవలం గ్యారెంటీలే కాకుండా, ఎన్నికలకు ముందు వివిధ డిక్లరేషన్ల రూపంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు ఇచ్చిన వాగ్దానాలను కూడా ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కేటీఆర్ కోరారు. గత రెండేళ్లుగా ఆయా వర్గాలకు చెల్లించాల్సిన నిధులు, బకాయిలను ఈ బడ్జెట్‌లో చేర్చి వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని గుర్తుచేశారు.ఒకవేళ ఈ బడ్జెట్‌లో కూడా హామీల అమలుకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా 'మోసకారి కాంగ్రెస్'ను ప్రజల పక్షాన ఎక్కడికక్కడ నిలదీస్తాం అని కేటీఆర్ తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ సమాజం ఇంకెంతమాత్రం ఓపికపట్టే స్థితిలో లేదని, ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తామని తన లేఖలో స్పష్టం చేశారు.

# కందుకూరులో జేసీ విస్తృత పర్యటన

### -అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాల సందర్శన



కందుకూరు,

జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి గురువారం కందుకూరు పట్టణంలో పర్యటించారు. ఉప్పుచెరువు, కృష్ణానగర్, విజయనగర్ కాలనీలలోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను, ఆహార సరుకుల నిల్వను తనిఖీ చేసి, మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం పెడుతున్నారా... లేదా అని పరిశీలించారు. పిల్లలతో ప్రత్యేకంగా మాట్లాడారు. స్థానికంగా ఉన్న పిల్లల తల్లులతో కూడా జాయింట్ కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. చిన్ననాటి నుంచే పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా బలమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వారికి వివరించారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కూడా జాయింట్ కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారిలోని విద్యా ప్రమాణాలను పరిశీలించారు. తరగతికి తగినట్లుగా విద్యార్థులలో ప్రమాణాలు పెంచేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోధించాలని టీచర్లను ఆదేశించారు. ఈ పర్యటనలో ఆమె వెంట సబ్ కలెక్టర్ హిమవంశీ, ఇతర అధికారులు ఉన్నారు.

విజేత

శుక్రవారం 20 ఫిబ్రవరి 2026

## ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర దుకాణ యూనిట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



విజేత జీలుగుమిల్లి

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ప్రాంగణంలో చేనేత కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర దుకాణ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రంగం మన సంప్రదాయం, సంస్కృతి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలస్థంభమని తెలిపారు. చేనేత కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు రావాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారికి ఆర్థిక భరోసా కల్పిస్తాయని అన్నారు.చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా కళాకారుల జీవనోపాధి మెరుగుపడటమే కాకుండా, మన సాంప్రదాయ వృత్తులు సజీవంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు స్వయంగా చేనేత వస్త్రాలను వినియోగించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అసెంబ్లీ ఆవరణలో ఇలాంటి దుకాణాల ఏర్పాటు ద్వారా ప్రజల్లో చేనేతపై మరింత అవగాహన పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, పంతం నానాజీ, బత్తుల బలరామకృష్ణ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది.



## క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం

విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీర ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు సామాజిక నైపుణ్యాలు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు పేర్కొన్నారు. మండలంలోని పెద్ద తాడేపల్లి వాసి ఇంజనీరింగ్ కాలేజీలో శ్రీ చైతన్య స్కూల్ ఆధ్వర్యంలో జోనల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్పోర్ట్స్ మీట్ లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని పలు క్రీడలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్, చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజలకు సచివాలయ సేవలపై అవగాహన కల్పించాలి.

### -ఆర్డీవో ఎం.వి.ఎస్. లోకేశ్వర రావు



విజేత అరకు లో య.

ప్రభుత్వ సచివాలయాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని,సేవల నాణ్యతపై ప్రభుత్వం నిర్వహించే ఐవిఆర్ఎస్ కాల్స్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని గౌరవ పాడేరు రెవిన్యూ డివిజనల్ అధికారి ఎం.వి.ఎస్.లోకేశ్వర రావు అధికారులను ఆదేశించారు.గురువారం దుంబ్రిగూడ,అరకులోయ మండల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కీలక ఆదేశాలు జారీ చేశారు.సచివాలయ సేవల కోసం సిబ్బంది ఎవరైనా అదనంగా డబ్బులు వసూలు చేసినా,లేదా నిర్ణీత సమయంలో సేవలు అందించడంలో విఫలమైనా ప్రజలు తమకు వచ్చే ఐవీఆర్ఎస్ కాల్‌లో నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలకు సిబ్బంది వివరించాలన్నారు.ఎలక్టర్ మ్యాపింగ్ ప్రక్రియను,ఎలక్షన్ ఫార్మ్స్ డిస్పోసల్‌ను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఇందులో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని హెచ్చరించారు.పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సేవలపై ఆరా తీస్తూ, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో అరకులోయ, దుంబ్రిగూడ మండలాల తహసీల్దారులు, గ్రామ రెవెన్యూ అధికారులు,సర్వేయర్లు మరియు ఇతర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణ పరిశుభ్రతకు సహకరించండి

### ఆటో యూనియన్ నాయకులతో మున్సిపల్ కమిషనర్



విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: పట్టణ సుందరీకరణకు, పరిశుభ్రతకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు ఆటో యూనియన్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక తణుకు రోడ్ లోని ఆటో యూనియన్ సభ్యులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. పరిశుభ్రత విషయంలో పట్టణం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండడానికి కృషి చేస్తున్నామన్నారు. స్వచ్ఛత, పచ్చదనం, ప్రజా సౌచాలయాల వినియోగం, బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన నివారణ విషయాలపై చర్చించారు. పట్టణాభివృద్ధి విషయంలో కమిషనర్ చేస్తున్న కృషిని ఆటో యూనియన్ సభ్యులు ప్రశంసించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ తాడేపల్లిగూడెం కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి తమ వంతు సాయం చేస్తామని వారు ఇచ్చారు.



## అరిటాకు బిర్యాని హోటల్ ను ప్రారంభించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్



విజేత చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలోని రైతు బజార్ పక్కన మేడూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభమైన అరిటాకు బిర్యాని హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మర్రి రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని హోటల్‌ను ప్రారంభించారు.లిఅలాగే అరిటాకు భోజనం హోటల్ పక్కన తొట్టెంపూడి పున్న శేఖర్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎ 2 రిలాక్స్ జ్యూస్ అండ్ టీ స్టాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూడా ముఖ్య అతిథిగా పాల్గొని టీ స్టాల్ ను ప్రారంభించినారు.ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, రుచి మరియు శుచిత్వాన్ని పాటిస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందాలని , తద్వారా వ్యాపారంలో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మురుకుట్ల శ్రీధర్ కుమార్ కిలారు సుబ్బయ్య దొప్పలపూడి అప్పారావు సయ్యద్ హిదాయితుల్లా నిడమానూరి హనుమంతరావు లి తదితరులున్నారు.

## ఆర్ కె భవన్ అరిటాకు బిర్యాని రెస్టారెంట్, జ్యూస్ స్టాల్ మరియు కేఫ్ వైభవంగా ప్రారంభించినమాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు







విజేత చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ కె భవన్ అరిటాకు బిర్యాని రెస్టారెంట్, జ్యూస్ స్టాల్ మరియు కేఫ్ వైభవంగా ప్రారంభమైంది. పట్టణంలోని నరసరావుపేట సెంటర్, రైతు బజార్ పక్కన మేడూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ మేడూరి ఆంజనేయులు నూతనంగా ప్రారంభించిన ఈ వ్యాపారం నిర్విఘ్నంగా కొనసాగాలని ఆకాంక్షించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ, వ్యాపార రంగంలో మంచి పేరు సంపాదించుకోవాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఈ సందర్భంగా యజమానికి శుభాకాంక్షలు తెలిపారు

## క్రీడలతో శారీరక.. మానసికోల్లాసం :- ప్రత్తిపాటి

### - రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన మాజీమంత్రి.



విజేత చిలకలూరిపేట

విద్యార్థిదశలోనే కాకుండా యుక్తవయసులోనూ యువత తమ శారీరక, మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలని, అందుకు క్రీడలే ప్రధాన మార్గమని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు.గురువారం ఆయన పట్టణంలోని సాంబశివనగర్ చెరువురోడ్డులో, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గట్టినేని విజయ సాయి నేతృత్వంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సరదాగా కాసేపు ప్రత్తిపాటి క్రికెట్ ఆడి, ఆటగాళ్లను ఉత్సాహపరిచారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, నేటి యువత సోషల్ మీడియాకు బానిసలు కాకుండా, ఇండోర్ , అవుట్ డోర్ క్రీడలపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రతిబింబిస్తూ టోర్నమెంట్ లో పాల్గొని తమ ఆటతీరు ప్రదర్శించాలని ప్రత్తిపాటి సూచించారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గట్టినేని విజయసాయి పోటీల్లో గెలుపొందిన జట్టుకు మొదటిబహుమతిగా రూ.1,00,116లు అందించడానికి ముందుకు రావడం నిజంగా అభినందనీయమని ప్రత్తిపాటి ప్రశంసించారు. కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు గట్టినేని విజయ్ సాయి, జస్టీ కిన్ను, దిలీప్, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



## పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### హైవే వంతెన పైనుంచి వాగులోకి దూసుకెళ్లిన కారు

విజేత ఎడ్లపాడు

యడ్లపాడు సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.బెంగళూరు నుండి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు వైపు వెళ్తున్న ఓ కారు యడ్లపాడు హైవేపైకి రాగానే ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయింది. అతివేగంతో ఉన్న కారు ముందు వెళు_న్న ఆటోను, బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి కారు హైవే వంతెనపై ఉన్న రక్షణ గోడను ఢీకొట్టుకుంటూ నేరుగా కింద ఉన్నవాగులోకిదూసుకెళ్లింది.తండ్రీకొడుకులకు గాయాలుప్రమాద సమయంలో కారులో ప్రయాణిస్తున్న తండ్రి, ఆయన పదేళ్ల కుమారుడు ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారితో పాటు ఆటో, బైక్‌పై ప్రయాణిస్తున్న మరో ఇద్దరు కూడాగాయాలపాలయ్యారు.స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం గుంటూరు సమీపంలోని కాటూరి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి అత్యవసర చికిత్స అందుతోంది. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## కలరింగ్ అండ్ హ్యాండ్ రైటింగ్ పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ

విజేత అరకులో య..

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం ఎండపల్లి వలస బాలికల గురుకుల పాఠశాలలో గురుకులం కోఆర్డినేటర్ పి.సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని ఔరంగాబాద్ కు చెందిన స్టూడెంట్స్ డెవలప్ మెంట్ సొసైటీ సహకారంతో నేషనల్ కలరింగ్ అండ్ హేండ్ రైటింగ్- 2025 కాంపిటేషన్స్ లో నిర్వహించిన పోటీల్లో అరకులోయ గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు అత్యత్తున ప్రతిభ కనబరిచారు.గురువారం నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ తరగతులకు చెందిన దాదాపు 190 మంది విద్యార్థులలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గురుకులం కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ 2025 నవంబరు 28 న నిర్వహించిన ఈ పరీక్షలో గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినిలకు 8 మంది చిన్నారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు అన్నారు..వీరిలో నలుగురు విద్యార్థినులు నేషనల్ కలా గౌరవ్ అవార్డు సాధించిగా, మరో నలుగురు చిన్నారులు నేషనల్ కళా భూషణ్ అవార్డు సాధించారన్నారు.వీరితో పాటు ఐడియల్ టీచర్ గా ఇంగ్లిషు ఉపాధ్యాయురాలు సుమలతను ఐడియల్ ప్రిన్సిపాల్ గా పాఠశాల ప్రిన్సిపాల్ నాగరత్నంను ఎంపిక ఎంపీగా చేసినట్లు ఆయన తెలిపారు.అత్యుత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థినులకు సహాయ గిరిజన సంక్షేమ అధికారి వెంకట రమణమూర్తి,ఎంఈఓలు త్రినాథరావు, భారతిరత్నం,గురుకులం కోఆర్డినేటర్ టి. సత్యనారాయణమూర్తి అభినందించి వారి చేతుల మీదుగా చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.మైదాన ప్రాంత విద్యార్థులకు ఏమాత్రం తీసిపోని ప్రతిభ గిరిజన విద్యార్థుల్లో ఉందని..అయితే వారిలో ఉన్న ప్రతిభను వెలికితీస్తే కచ్చితంగా మంచి ఫలితాలు సాధిస్తారనడానికి ఇదే నిదర్శనమని ఏటీడీబ్ల్యూఓ రమణమూర్తి హర్షం వ్యక్తం చేసారు.అదే విధంగా మిగిలిన పిల్లలు కూడా విజేతలుగా నిలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకుని మంచి ఫలితాలు సాధించాలని ఏటిడబ్ల్యు వెంకటరమణ ఆకాంక్షించారు



# నియోజకవర్గం లో సమస్యలు పై అసెంబ్లీలో ప్రస్తావన

## -నియోజకవర్గంలోని ప్రతి ప్రధాన సమస్యను పెందుర్తి ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావిస్తున్నారు.

విజేత పెందుర్తి::అసెంబ్లీ సమావేశాలు జరిగిన ప్రతిసారి పెందుర్తి నియోజకవర్గం లోని ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తూ పెందుర్తి ప్రజల ప్రశంసలు పొందుతున్నారు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, తాజాగా శాసనసభ అసెంబ్లీ సమావేశాల్లో జరిగిన జీరో అవర్లో పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని పరవాడ మండలంలో కొనసాగుతున్న కాలుష్య సమస్యలపై ఎమ్మెల్యే పంచకర్ల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు,

పరవాడ మండలంలోని ఎన్ టి పి సి, హిందూజా, ఫార్మాసిటీ కంపెనీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా వాహనాలు ద్వారా పరవాడ లంకెలపాలెం రోడ్డు సమీపంలోని ప్రజలు నరక యాతన పడుతున్నారని సభకు వివరించారు,దీనిపై ఇప్పటికే నాలుగు సార్లు సభలో ప్రస్తావించానని దురదృష్టవశాత్తు ఇప్పటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తంచేశారు, ఆయా కంపెనీలు ప్రత్యేక రోడ్డును ఏర్పాటు చేసుకొని వాహనాల రాకపోకలకు నిర్దేశించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు,దీని ద్వారా 50 శాతానికి పైగా కాలుష్య సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు,

దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని అసెంబ్లీ సభా వేదికగా కోరారు,అయితే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిన ప్రతిసారి ప్రత్యేకంగా అనుమతి కోరారు.






# గుండ్రేవుల సమస్యపై అసెంబ్లీలో ప్రస్తావించిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి ధన్యవాదాలు

## -ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు గౌడ్

కోడుమూరు

కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గారు కర్నూలు,కోడుమూరు నియోజకవర్గ రైతుల సమస్య అయినటువంటి గుండ్రవుల ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో ప్రస్తావించడం గుండ్రేవుల ప్రాజెక్టు పూర్తి చేస్తే కర్నూలు కోడుమూరు నియోజకవర్గాల తాగు, సాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది అని చెప్పి రాష్ట్రప్రభుత్వం దృష్టికు తీసుకుపోయినటువంటి ఎమ్మెల్యే గారికి అఖిలభారత యువజన సమాఖ్య తరపున ధన్యవాదములు తెలియజేస్తున్నాము.కోడుమూరు మండల ప్రజల సాగు సాగు, తాగునీటి అవసరాల కోసం జిడిపి నుంచి నీటిని తీసుకువచ్చే విధంగా నిధులు విడుదల చేయించాలని,తాగునిటీ శాశ్వత పరిష్కారం కోసం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించి మండల ప్రజలకు తాగునీటి అవసరాలు శాశ్వతంగా తీర్చడానికి నిధులు విడుదల చేయించాలని,అప్పుడే కోడుమూరు నియోజవర్గం తాగునీటి అవసరాలు తీరుతాయని ఏఐవైఎఫ్ గా విజ్ఞప్తి చేస్తున్నాము.





### విజేత పత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన

# అధికార యంత్రాంగం



విజేత దేవరపల్లి;

తూర్పుగోదావరి గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి మండలం దేవరపల్లి గోపాలపురం మూడు రోడ్ల సెంటర్ వద్ద అధ్వానంగా ఉన్న డ్రైనేజీ పై దేవరపల్లిలో అధ్వానంగా డ్రైనేజీలు అనే వార్త ప్రచురితం అయ్యింది ఈ వార్తకు స్పందించిన అధికార యంత్రాంగం తాత్కాలికంగా డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టారు దీంతో ప్రయాణికులు. స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పంచాయతీ కార్యాలయ సమీపంలో

# అక్రమ భవన నిర్మాణం..

## -పట్టించుకోని అధికార యంత్రాంగం.. మండిపడుతున్న గిరిజనలు.

విజేత. అరకు లోయ.

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం పెదలబుడు మేజర్ పంచాయతీ కార్యాలయ సమీపంలో అధికారుల అనుమతులు లేకుండా అక్రమ భవన నిర్మాణం జోరుగా సాగుతుంది. అరకులోయ మండలం ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇక్కడ భూభాగలాయింపు చట్టం అమలలో ఉంటుంది. ముఖ్యంగా పెదలబుడు మేజర్ పంచాయతీ అరకులోయ పట్టణంలో భూపాదలాయింపు చట్టం పటిష్టంగా అమల్లో ఉండాలి.అయితే పంచాయితీ రెవిన్యూ అధికారులు అక్రమ నిర్మాణదారుల నుండి కాసులకు కక్కుర్తి పడి చట్టాలను తుంగలో తొక్కి అక్రమ భవన నిర్మాణాలకు ప్రోత్సహిస్తూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.అక్రమ నిర్మాణం నిలుపుదలపై వీఆర్ఓకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని గిరిజనులు అంటున్నారు.అరకులోయ పట్టణంలోని పెదలబుడు మేజర్ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఎల్సూరి సింహాద్రి అనే గిరిజనేతరుడు అక్రమ గృహ భవన నిర్మాణం జరుగుతున్న పంచాయతీ, రెవిన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గిరిజనులు మండిపడుతున్నారు. గిరిజన చట్టాలను రక్షించవలసిన పంచాయతీ రెవెన్యూ అధికారులు చట్టాలను భక్షించే విధంగా గిరిజనేతరుడుకు అక్రమ భవన నిర్మాణానికి సహకరిస్తున్నారని గిరిజనులు మండిపడుతున్నారు.గిరిజన చట్టాలు గిరిజనేతరులకు చుట్టాలుగా మారుతున్నాయి అనడానికి ఈ అక్రమ భవన నిర్మాణమే నిదర్శనమని గిరివాసులు అంటున్నారు. పంచాయతీ కార్యాలయం సమీపంలోనే గిరిజనేతరుడు దర్జాగా చట్టాలను ధిక్కరించి అక్రమ భవన నిర్మాణం దర్జాగా చేపడుతున్న అధికారులు పట్టించుకోకపోవడంపై గిరిజనులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గిరిజనేతురుల వద్ద అక్రమ భవన నిర్మాణాల కోసం పంచాయితీ,రెవిన్యూ అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా భారీ స్థాయిలో ఆమ్యామ్యాలు సేకరించి గిరిజన చట్టాలను నీరుగారుస్తున్నారని గిరి ప్రజలు వాపోతున్నారు.గిరిజన చట్టాలను పరిరక్షించడంలో అధికారులు,ప్రజాప్రతినిధులు, పంచాయితీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే దర్జాగా అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయని ప్రజాసంఘాల నాయకులు సైతం మండిపడుతున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, పాడేరు ఆర్డిఓ లోకేష్ శౌర్యమాన్,పాడేరుజిల్లా పంచాయతీ అధికారి అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి అరకులోయ పట్టణంలోని పెదలబుడు మేజర్ పంచాయతీ కార్యాలయం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ భవన నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని గిరిజనులు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పంచాయితీ రెవెన్యూ కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టక తప్పదని వారు హెచ్చరిస్తున్నారు





# వైభవంగా వాలీశ్వర స్వామివారికి వసంతోత్సవం

రామసముద్రం ఫిబ్రవరి 19 విజేత

రామసముద్రం మండలం ఆర్. నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం సమీపంలోని కొండపై వెలసిన శ్రీ వాలీశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా చివరి రోజు వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయ అర్చకులు లోకనాధం దీక్షితులు ఆధ్వర్యంలో అర్చకులు సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి తోమాలసేవ సహస్రనామార్చన నిర్వహించి పాలు, పెరుగు, తేనే, కొబ్బరి నీళ్ళ, పసుపు చందనాలతో అభిషేకం చేశారు. అనంతరం శివ పార్వతులను ఆలయ ముఖద్వార దగ్గర మండపంలో వెంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.రాత్రి స్వామి వారికి పలు రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో అలంకరణ చేసి శయనోత్సవం ఘనంగా నిర్వహిస్తామని ఆలయప్రధాన అర్చకులు లోకనాధం దీక్షితులు తెలిపారు.

# తోట శివ మల్లికార్జున రావుకు నివాళులర్పించి,న మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు



విజేత గుంటూరు

గుంటూరు మండల మాజీ యంపిపి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు తోట లక్ష్మి భర్త తోట శివ మల్లికార్జున రావు ఇటీవల మరణించగా, ఈరోజు గుంటూరు పట్టణంలోని, లాలుపురం లో గల వారి నివాసానికి వెళ్లి, వారి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు

# ఘనంగా అప్పలనరసయ్య జయంతి వేడుకలు



విజేత గోపాలపట్నం::మాజి ఎంపి స్వర్గీయ పెధకంశెట్టి అప్పలనరసయ్య 90 వ జయంతి వేడుకలను ఆయన తనయుడు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు హాజరుకాగా,యువత, గణబాబు యువసేన, తెదేపా నాయకులు కార్యకర్తలు,అప్పలనరసయ్య శిష్యగణం,అభిమానులు, కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తదానం చేసారు, రక్తదానం చేసిన ప్రతీ ఒక్కరికీ గణబాబు చేతులమీదుగా సర్టిఫికెట్ లు ప్రదానం చేశారు, ముందుగా కేకును కట్ చేసి దివంగత అప్పలనరసయ్య కు ఘనంగా నివాళులు అర్పించారు, కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

# చిన్నారి అలేఖ్య ని ఆశీర్వదించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్, సోమేపల్లి



విజేత కట్టుబడివారిపాలెం

చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెం గ్రామ వాస్తవ్యులు రామిశెట్టి శ్రీమన్నారాయణ కుమార్తె నూతన వస్త్ర బహుకరణ వేడుక వారి స్వగృహం నందు జరుగుచుండగా ఆ వేడుకకు హాజరై చిన్నారి అలేఖ్య ని ఆశీర్వదించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్, సోమేపల్లి వెంకటసుబ్బయ్య .ఈ కార్యక్రమంలో వారివెంట రామిశెట్టి సాంబశివరావు, ముత్యాల వెంకయ్య, తిమ్మిశెట్టి ఏడుకొండలు, రామిశెట్టి యల్లమందయ్య, రామిశెట్టి సుబ్బారావు, తిమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఉప్పు వెంకటేశ్వర్లు (మెంబర్),కతారి ఏడుకొండలు, కతారి శ్రీనివాసరావు, చిందుకూరి జయకృష్ణ, ముత్యాల పోతురాజు, ఉప్పు వేణుబాబు తదితరులున్నారు

# నెహ్రూ నగర్‌లో డ్రైనేజీ పనుల పరిశీలన మున్సిపల్ డీ.ఈ. రహీం

విజేతచిలకలూరిపేట:

పట్టణంలోని నెహ్రూ నగర్ ప్రాంతంలో ఎన్టీఆర్ విగ్రహం ఎదురుగా నూతనంగా సైడ్ కాలవ డ్రైనేజీ పనులను మున్సిపల్ డీఈ రహీం పరిశీలించారు. నిర్మాణ పనులు సజావుగా సాగాలంటే దారిలో ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలని, తద్వారా పక్కా ప్రణాళికతో డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు మరియు సిబ్బందికి సూచించారు. ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న ఈ పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, నాణ్యతతో కూడిన నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వీరితోపాటు, వార్డ్ టిడిపి నాయకులు, కాంట్రాక్టర్ మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

